నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, ఆదివారం 15 జూన్ 2025 | KHAMMAM

లబ్ధిదారులకు రేషన్ దుకాణంలో బియ్యం తూకం వేస్తున్న దృశ్యం

కేటీఆర్‌కు నోటీసులు.. ప్రజల దృష్టి మళ్లించేందుకే..

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

మాట్లాడుతున్న హరిప్రియానాయక్

ఇల్లెందు, జూన్ 14: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చేందుకే మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసుల పేరుతో కుయుక్తులు పన్నుతున్నదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ఒకసారి కేటీఆర్‌ను సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయిన సందర్భాన్ని ఆమె గుర్తుచేశారు. ఫార్ములా ఈ రేస్ సజావుగా సాగిందని, ఇందులో ఎలాంటి అక్రమాలు జరగకున్నా, అవి నీతికి చోటుచేసుకోకున్నా కేటీఆర్‌ను విచారించడం చట్టవ్యతిరేకమన్నారు.

ప్రజాపాలన కాదిది.. నయవంచన పాలన

- హామీలు అమలు చేసేదాకా ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వం
- ఎన్ని కేసులు పెట్టినా అదరం బెదరం
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

కొత్తగూడెం అర్బన్, జూన్ 14: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరాల్సిందేనని, ప్రజాపాలన అంటూ ప్రచారం చేసుకుంటున్న రేవంత్ సర్కార్‌ది నయవంచన పాలన అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయం ప్రగతిభవన్‌లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్, భద్రాచలం పార్టీ ఇన్‌చార్జి రామకృష్ణతో కలిసి పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలను నెరవేర్చే దాకా ప్రభుత్వంపై ఉద్యమాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తమని, సీతారామ ప్రాజెక్టు నీళ్ల విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పూర్తి అన్యాయం జరిగిందని అన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తోందని, ఎన్ని కేసులు పెట్టినా అదిరేది బెదిరేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారణ పేరుతో వేధించడం వల్ల ఒరిగేది ఏమీ లేదన్నారు. వందశాతం గత ప్రభుత్వంలో ప్రజలకు, రైతులకు, మహిళలకు అన్నివర్గాల వారికి ఉపయోగపడే పనులే చేశామని, పారదర్శకంగా పరిపాలన చేశామన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, పార్టీ అన్ని అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షుడు, ఐదు నియోజకవర్గాల ముఖ్య నాయకులు, అన్ని మండలాల అధ్యక్షుడు, అన్ని మండలాల ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

45 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ

భాగస్వాములు కావాలి

సమీక్షలో డైరెక్టర్లు, జీఎంలకు సూచనలు చేస్తున్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ 'ప్రతి అడుగు పచ్చదనం' నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపడుతున్నదని, దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా ప్రత్యేక చొరవ చూపాలని సింగరేణి సీఎండీ బలరాం ఆదేశించారు. శనివారం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జీఎంలతో వివిధ అంశాలపైన సమీక్షించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనన్ని మొక్కలు నాటాలని కోరారు. నీటి బిందువు జలసింధువు కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడా మరో వారంరోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ జీ 14, జీ 15 గ్రేడ్ గల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని, దానికి బదులు జీ 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి తగు ఏర్పాటు చేయాలని జీఎంలను ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనుల్లో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుంచి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎస్‌డీఎం సుభాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా)గా గౌతమ్ బాధ్యతల స్వీకరణ

కొత్తగూడెం సింగరేణి, జూన్ 14 : సింగరేణి సంస్థలో డైరెక్టర్ పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్(పా)గా నియమితులైన ఐఏఎస్ అధికారి గౌతమ్ పోట్రు శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాం సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను డైరెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్(పా)కు శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎస్‌డీఎం సుభాని, జీఎం మార్కెట్ ఎన్‌వీ రాజశేఖర్‌రావులు తమ అభినందనలు తెలిపారు.

సీఎండీకి బొకే ఇస్తున్న నూతన డైరెక్టర్(పా)

కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమం

- లోక్ అదాలత్‌లలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల న్యాయమూర్తుల ఉద్ఘాటన
- ఖమ్మంలో 6,220, భద్రాద్రి కొత్తగూడెంలో 6,494 కేసుల పరిష్కారం

ఖమ్మం లీగల్/ కొత్తగూడెం టౌన్/ భద్రాచలం, జూన్ 14: సమాజంలో సుఖ శాంతులకు రాజీమార్గమే ఉత్తమమని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రాజగోపాల్, వసంత్‌పాటిల్, భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి శివనాయక్ పేర్కొన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులను పెద్ద మనసుతో క్షమించి రాజీమార్గంలో పయనించాలని సూచించారు. కలహిస్తున్న కక్షిదారుల ముఖాలపై చిరునవ్వులు చూడడమే లోక్ అదాలత్ ధ్యేయమని స్పష్టం చేశారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కోర్టుల్లోనూ, భద్రాచలం కోర్టులోనూ శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో న్యాయమూర్తులు మాట్లాడారు. కలహాలు లేని సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు. కుటుంబ కలహాలను విడనాడి తమ కేసులను సామరస్యంగా, రాజీమార్గం ద్వారా జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న వారు స్వేచ్ఛా జీవితాన్ని గడుపుతారని అన్నారు. కాగా, క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, మోటారు ప్రమాదాలు, బ్యాంకులు, కుటుంబ కేసుల్లో కలిపి ఖమ్మం జిల్లా కోర్టులో 6,220, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో 6,494 కేసుల పరిష్కారమయ్యాయి. కేసుల్లో రాజీపడిన కక్షిదారులకు న్యాయమూర్తులు పూలమొక్కలు, పత్రాలు, పరహారాలు అందించారు. అలాగే, క్రిమినల్ అప్పీల్‌ను కూడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సదరు కక్షిదారులతో చర్చించి పరిష్కరించారు.

రాజీపడిన కక్షిదారులకు పత్రాలను, పరిహారాన్ని అందిస్తున్న ఖమ్మం, భద్రాద్రి జడ్జిలు రాజగోపాల్, వసంత్ పాటిల్

లారీలోంచి నేరుగా వ్యాన్‌లోకి బియ్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు


ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం ఎగుమతి చేస్తున్న హమాలీలు

ఏటా రూ.9 కోట్లు స్వాహా?

- 'భద్రాద్రి' చౌక దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరాలో చేతివాటం?
- 50 కేజీల బియ్యం బస్తాకు సుమారు 2-3 కేజీల చొప్పున తరుగు
- దాదాపు 60 వేల క్వింటాళ్ల బియ్యంపై రూ.75 లక్షల వరకూ దోపిడీ..
- తూకం వేయకుండానే 'ఎంఎల్ఎస్'ల నుంచి నేరుగా రేషన్ షాపులకు..
- గోదాము నుంచి వచ్చిన బియ్యాన్ని 'పాయింట్ల'లో దింపని వైనం
- ఎఫ్‌సీఐ నుంచి వచ్చిన లోడును ఎంఎల్ఎస్‌లో దింపకుండా షాపులకు..
- ఇక్కడ హమాలీలకు చెల్లించే మొత్తం నుంచీ సగం కమీషన్ మింగివేత!

భద్రాద్రి జిల్లాలో రేషన్ బియ్యం సరఫరాలో భారీ దోపిడీ జరుగుతోంది. రేషన్ షాపులకు పంపుతున్న బియ్యంలో 2 నుంచి 3 కేజీల వరకూ తరుగు తీస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో ఇటు ఎఫ్‌సీఐ అధికారులు, అటు పౌరసరఫరాల శాఖ అధికారులు, మధ్యలో స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్లు ప్రయోజనం పొందుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, తరుగు పేరిట జరుగుతున్న ఈ వ్యవహారంలో భద్రాద్రి జిల్లాలో పడాదికి పకంగా రూ.9 కోట్ల వరకూ స్వాహా జరుగుతున్న తీరు ఆందోళనకరం. తరుగు తీయడం, తూకం తక్కువగా రావడం వంటి కారణాలతో డీలర్లు వాటిని సర్దుబాటు చేసుకునేందుకు మరికొన్ని అడ్డదారులు తొక్కాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చాలీచాలని కమీషన్లతో డీలర్లు నెట్టుకొస్తున్నప్పటికీ పైస్థాయిలో జరిగే ఈ స్వాహాకారాల వల్ల వీరు కూడా తమ స్థాయిలో కొద్దో గొప్పో చేతివాటాన్ని ప్రదర్శించక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే, ఈ రొచ్చులోకి దిగని కొందరు డీలర్లు మాత్రం తరుగు వల్ల తక్కువగా వచ్చిన బియ్యాన్ని కార్డుదారులకు సర్దుబాటు చేయలేక తలలు పట్టుకుంటుండడం గమనార్హం.

-అశ్వారావుపేట, జూన్ 14

రేషన్ దుకాణానికి వచ్చిన బియ్యంలో 50 కేజీలకు గాను 3 కేజీలు తర్గి 47 కేజీలుగా చూపిస్తున్న తూకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో అన్ని స్థాయిల్లోనూ దోపిడీలు జరుగుతున్నాయి. ఫలితంగా ఆఖరి దశలో డీలర్లపై ఆర్థికభారం పడుతోంది. భద్రాద్రి జిల్లాలో ఉన్న 443 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 5 వేల నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల బియ్యం కార్డుదారులకు పంపిణీ అవుతున్నాయి. అంటే 50 వేల నుంచి 60 వేల క్వింటాళ్లు అన్నమాట. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఒక్కో క్వింటాను 50 కేజీల చొప్పున విభజించి రెండు బస్తాల్లో పోసి మండలాల్లోని మండల స్థాయి స్టాక్ పాయింట్ల (ఎంఎల్ఎస్)కు పంపి పౌర సరఫరాల శాఖకు అప్పగిస్తుంది. ఈ బస్తాలను పౌర సరఫరాల శాఖ రేషన్ షాపులకు చేరవేస్తుంది. అయితే, ఈ బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు స్టేజ్-1 కాంట్రాక్టర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు స్టేజ్-2 కాంట్రాక్టర్లు సరఫరా చేస్తారు.

తూకం లేకుండానే..

భద్రాద్రి జిల్లాలో దమ్మపేట, పాల్వంచ, అశ్వాపురం, ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యాన్ని బస్తాల్లో తూకం వేసి 50 కేజీలు కచ్చితంగా ఉండేలా చూసి పంపాలి. కానీ అందుకు విరుద్ధంగా ఎఫ్‌సీఐ గోదాముల నుంచి వచ్చిన బియ్యం బస్తాలను తూకం లేకుండా ఎంఎల్ఎస్ పాయింట్లలో దించడం, తిరిగి అవే బస్తాలను మళ్లీ తూకం వేయకుండానే రేషన్ షాపులకు పంపడం జరుగుతోంది. తీరా రేషన్ షాపులకు చేరిన బస్తాలను డీలర్లు తూకం వేయడంతో ఒక్కో 50 కేజీల బస్తాకు 2 నుంచి 3 కేజీలు తక్కువగా ఉంటున్నాయి. అధికారులను ప్రశ్నించలేక డీలర్లు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు డీలర్లయితే కార్డుదారుల వద్ద కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నారు. అయితే, ఇప్పుడు మూడు నెలల బియ్యం ఒకేసారి రావడంతో ఇక తూకం గీకం ఏమీలేదంటూ నేరుగా చౌకదుకాణాల్లో దించేస్తున్నారు. అయితే, బియ్యంలో తరుగు తీయడం, ఆ బియ్యాన్ని బయట విక్రయించుకొని సొమ్ము చేసుకోవడం వంటివి బహిరంగ రహస్యమేనని చాలామంది డీలర్లు పేర్కొంటున్నారు.

ఇదీ.. దోపిడీ లెక్క..

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దోపిడీ ఎలా జరుగుతుందన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఒక్కో బస్తా నుంచి 2 నుంచి 3 కేజీలు తక్కువ బియ్యం వస్తాయి. భద్రాద్రి జిల్లాకు నెలకు 50 వేల నుంచి 60 వేల క్వింటాళ్ల బియ్యం వస్తాయి. ఒక్కో క్వింటా బియ్యాన్ని 50 కేజీల చొప్పున విభజించి రెండు బస్తాల్లో పోసి పంపిస్తారు. దీని ప్రకారం 50 వేల నుంచి 60 వేల క్వింటాళ్ల బియ్యమంటే లక్ష నుంచి 1.20 లక్షల బియ్యం బస్తాలన్న మాట. ఒక్కో బస్తాకు 2 కేజీల చొప్పున తగ్గినా.. 2 లక్షల నుంచి 2.40 లక్షల కేజీల బియ్యం తక్కువగా వస్తున్నాయి. కేజీ బియ్యం ధర రూ.39 రూపాయలు కాగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.38, రాష్ట్ర ప్రభుత్వం రూ.1 చొప్పున భరిస్తూ కార్డుదారులకు ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. అయితే, అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి కేజీ రూ.39 విలువైన బియ్యాన్ని బయట వ్యాపారులకు రూ.30కే విక్రయిస్తారు. అంటే నెలకు 2 లక్షల నుంచి 2.40 లక్షల కేజీల బియ్యాన్ని విక్రయించి రూ.60 లక్షల నుంచి రూ.72 లక్షల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. అంటే ఏడాదికి రూ.7.20 కోట్ల నుంచి సుమారు రూ.9 కోట్ల దాకా స్వాహా చేస్తున్నట్లు పలువురు డీలర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఎఫ్‌సీఐ గోదాము నుంచి వచ్చిన లారీలోంచి ఎంఎల్ఎస్ పాయింట్లోకి దింపడం కోసం, తిరిగి ఎంఎల్ఎస్ పాయింట్లోంచి రేషన్ షాపులకు వెళ్లే లారీల్లోకి ఎక్కించడం కోసం హమాలీలకు ఒక్కో బస్తాకు రూ.29 చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. అయితే, ఒక్కోసారి ఎఫ్‌సీఐ నుంచి వచ్చిన లారీలోని బియ్యం బస్తాలను ఎంఎల్ఎస్ పాయింట్లలో దింపకుండా.. రేషన్ షాపుల్లోకి వెళ్లే లారీల్లోకి హమాలీలతో నేరుగా ఎక్కిస్తుంటారు. దీంతో ఒకసారి దింపి మరోసారి ఎక్కించే పని లేకుండా నేరుగా ఎఫ్‌సీఐ లారీలోంచి షాపులకు వెళ్లే లారీల్లోకి నేరుగా ఎక్కిస్తున్నందున కొన్నిసార్లు అధికారులు ఈ హమాలీలకు రూ.14.50 చొప్పునే చెల్లిస్తున్నట్లు ఆరోపణ లొస్తున్నాయి.

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు వస్తున్న బియ్యంలో 50 కేజీల బస్తాకు సుమారు 2 నుంచి 3 కేజీల బియ్యం తక్కువగా వస్తున్నాయి. అయినప్పటికీ ఈ భారాన్ని డీలర్లే ఆర్థికంగా భరించాల్సి వస్తోంది. అందుకని ప్రభుత్వమే కచ్చితమైన

కచ్చితమైన తూకం వేసి అప్పగించాలి..

తూకం వేసి డీలర్లకు బియ్యం అప్పగించాలి. తరుగు విషయంపై దమ్మపేట ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి లక్ష్మణ్ స్పందిస్తూ.. బియ్యం బస్తాల తూకం తక్కువగా వచ్చినట్లు ఇప్పటి వరకూ డీలర్లెవరూ ఫిర్యాదు చేయలేదని సమాధానమిచ్చారు. దీనిపై వివరణ కోరేందుకు కొత్తగూడెం డీసీఎస్‌వో రాధా రుక్మిణిని 'నమస్తే తెలంగాణ' ఫోన్లో ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

-కొడాలి వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్ల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

మారుమూల పల్లెలకూ వైద్యసేవలందాలి

భద్రాద్రి జిల్లా పర్యటనలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

మొక్క నాటుతున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

బూర్గంపహాడ్, జూన్ 14: ఏజెన్సీలోని మారుమూల గిరిజన పల్లెలకూ వైద్యసేవలను అందించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. భద్రాద్రి జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన.. బూరంపహాడ్ మండలం మోరంపల్లి బంజర్ ప్రాథమిక వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలను గమనించారు. ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ల్యాబ్, మందుల గది, ప్రసవాల గది, ఓపీ గది, ఆసుపత్రి పరిసరాలు, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సమావేశ మందిరంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశావర్కర్ నుంచి మెడికల్ ఆఫీసర్ వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యాలపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్యం అందించే విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. జిల్లా వైద్యాధికారులు పీహెచ్‌సీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు జయలక్ష్మి, పీ.చైతన్య, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీసాహితీ, వైద్యులు మధువరన్, పుల్లారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.